


Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4782

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 355 | బుధవారం 15 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

IRS PUBLICATIONS
irspublications12@gmail.com



## తుది తీర్పు వరకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోండి

- భోజశాల కాంప్లెక్స్ కేసులో నమాజ్‌పై సుప్రీం

2లో




## ఉద్యమానికి వెల్లువెత్తుతున్న మద్దతు

- 25వ రోజుకు సీజేపీ ఆందోళన
- 17వ రోజుకు వాంగ్‌చుక్ నిరాహార దీక్ష
- వీరి నిరసనకు ప్రముఖుల సంఘీభావం
- ఢిల్లీ, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రుల మద్దతు

2లో



## బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్

- ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది
- మత్స్యకార కుటుంబాలకు జగన్ పరామర్శ
- సర్కార్ తీరుపై మండిపడ్డ వైసిపి అధినేత

**విశాఖపట్నం– సూర్యవాస్తవం:**

విశాఖలో బోటు ప్రమాదం జరిగిన వెంటనే చంద్రబాబు సర్కార్ ఎందుకు స్పందించలేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విశాఖలోని జబ్బర్‌తోటలో మత్స్యకార కుటుంబాలను ఆయన మంగళవారం పరామర్శించారు. బోటు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌కు తమ

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### ఇరాన్ యుద్ధంలో 14 మంది

# అమెరికా సైనికుల మృతి

## - 400 మందికి పైగా గాయాలు

**వాషింగ్టన్ – సూర్యవాస్తవం:**

ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన అమెరికా సైనికుల సంఖ్య 14కు చేరింది. తాజాగా... ఈ నెలలో అరేబియా సముద్రంలో హెలికాప్టర్ కూలిన ఘటనలో నౌకాదళ పైలట్ చనిపోయాడు. పోరులో గాయపడిన అమెరికా సైనికుల సంఖ్య సోమవారం నాటికి 400 దాటింది. వీరిలో ఎక్కువ మందికి తీవ్రమైన మెదడు గాయాలు అయ్యాయని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ చెప్పారు. ముందుగా కువైట్‌లోని కమాండ్ కేంద్రంపై జరిగిన ఇరాన్ డ్రోన్ దాడిలో ఆరుగురు సైనికులు చనిపోయారు. ఆ తర్వాత సౌదీ



అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో ఓ సైనికుడు మరణించాడు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా సైనిక చర్యకు సహకరిస్తున్న

- మిగతా 2లో..

### బద్రీనాథ్ ఆలయ విరాళాల చోరీ..

# సీఈవో పై ప్రశ్నల వర్షం




**హైదరాబాద్ – సూర్యవాస్తవం:**

హైదరాబాద్ బద్రీనాథ్ ఆలయ విరాళాల దుర్వినియోగం కేసులో దర్యాప్తు బృందం (సిట్) స్పీడు పెంచింది. గర్వాల్ నేతృత్వంలో సిట్ ఆలయ సీఈవో ను ప్రశ్నిస్తోంది. ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) సోహన్ సింగ్ రంగడ్ తోపాటు ఆయన వ్యక్తిగత సహాయకుడు అతుల్ దిమ్రిలపై ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. అదే విధంగా సిట్ అధికారులు

- మిగతా 2లో..

# పనికిరాని నిబంధనలు రద్దు చేయండి!

- ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు దిశానిర్దేశం
- పాతకాలపు బిజినెస్ రూల్స్‌లో సంస్కరణలకు సీఎం ఆదేశం
- ఫిర్యాదుల స్వీకరణకు క్రౌడ్ సోర్సింగ్ విధానాన్ని అమలు చేయాలి
- 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలని సూచన
- ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి పనులను ఆలస్యం చేయవద్దు
- 22ఏ భూ వివాదాలను పరిష్కరించి అవకాశాలు సృష్టించాలని దిశానిర్దేశం




**అమరావతి– సూర్యవాస్తవం:**

ప్రభుత్వ పాలనలో వేగం పెంచేందుకు, అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన ఆయన, అవసరం లేని, పాతబడిపోయిన 'బిజినెస్ రూల్స్'ను సంస్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేసి, నిబంధనలను సరళతరం చేయాలని నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ఉన్నతాధికారులు సరైన నాయకత్వంతో పనిచేస్తేనే ప్రభుత్వ ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు చేరతాయని స్పష్టం చేశారు. టెక్నాలజీని అనుసంధానం చేస్తూ పాలనలో పారదర్శకత తీసుకురావాలని సూచించారు. 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి 20 శాతం వృద్ధి సాధించిందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలన్నారు.

**దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా మార్చాలి**

దేవాదాయ శాఖపై సమీక్షలో భాగంగా రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ ఆలయాల పరిసరాల్లో ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. అదేవిధంగా, ఆర్టీసీ బస్సులు సరైన సమయానికి నడిచేలా చూడాలని, బస్టాండ్లలో

- మిగతా 2లో..



## మాజీ మంత్రి ముద్రగడ కన్నుమూత

**ప్రత్తిపాడు – సూర్యవాస్తవం:**

వైసీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం(73) కన్నుమూశారు. గత కొంతకాలంగా శ్వాస, కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు ఆయన స్వగ్రామ మైన కాకినాడ జిల్లా కిర్లంపూడిలో బుధవారం లేదా గురువారం

- మిగతా 2లో..




## ఫిఫా వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్‌లు..

- కర్ణాటక ప్రభుత్వ కీలక నిర్ణయం
- ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్‌ల కోసం బెంగళూరులో హోటళ్ల సమయం పొడిగింపు
- తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వ అనుమతి
- జులై 14, 15, 19 తేదీలకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తింపు
- నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి శివకుమార్ ప్రకటన

**హైదరాబాద్ – సూర్యవాస్తవం:**

ఫిఫా ప్రపంచకప్ 2026 పోటీల నేపథ్యంలో ఫుట్‌బాల్ అభిమానులకు కర్ణాటక ప్రభుత్వం తీపి కబురు అందించింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను పురస్కరించుకుని బెంగళూరు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లను తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ వెసులుబాటుతో అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగే మ్యాచ్‌లను

- మిగతా 2లో..

# గ్రీన్ ఫీల్డ్ రహదారికి అనుమతులివ్వండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగంలో 95శాతం భూసేకరణ పూర్తి..
- కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇవ్వాలని కోరిన సీఎం.
- ఫ్యూచర్ సిటీ - అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి మంజూరు చేయాలని విన్నపం
- రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల
- హైదరాబాద్‌కు ఆరు వరుసల రహదారి నిర్మాణం
- ఢిల్లీలో కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ



**హైదరాబాద్ – సూర్యవాస్తవం:**

రాష్ట్రంలో రవాణా రంగ ముఖచిత్రాన్ని మార్చే కీలక ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రీజినల్ రింగు రోడ్డు , ఫ్యూచర్ సిటీ – బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో పాటు పలు కీలక రహదారుల నిర్మాణాలపై సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి వెంటనే కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. అలాగే ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు కూడా మంజూరు చేస్తే, రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమై నిర్మాణం త్వరగా పూర్తి కావడమే కాకుండా వ్యయం కూడా తగ్గుతుందని సీఎం వివరించారు.

**ఫ్యూచర్ సిటీ – బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ హైవే:**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇందులో భాగంగా

- మిగతా 2లో..

## ఇరాన్ యుద్ధంలో 14 మంది
# అమెరికా సైనికుల మృతి

కేసీ-135 రీఫ్యూయ లింగ్ విమానం **ఇరాక్‌లో కూలిన ఘటనలో మరో ఆరుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మొత్తంగా ఇరాన్ యుద్ధంలో 413 మంది సైనికులు గాయాలపాలయ్యారు. అయితే వారిలో దాదాపుగా అందరూ తిరిగి విధులలో చేరారని సైనిక కమాండ్ ప్రతినిధి మేజర్ ఎమ్మా థాంప్సన్ తెలిపారు.**

## బద్రీనాథ్ ఆలయ విరాళాల చోరీ..
# సీఈవో పై పశ్నల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

ఆలయంలోని సీసీటీవీ కంట్రోల్ రూమ్‌లో తనిఖీలు చేపట్టారు. ఆలయంలో రోజువారీ విరాళాల లెక్కింపు ఎలా నిర్వహిస్తున్నారో గమనించారు. సస్పెండ్ అయిన బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) ఉద్యోగి ప్రమోద్ నౌటియాల్‌కు గోపేశ్వర్‌లోని జిల్లా సెషన్స్ కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించి, పుర్సాది జిల్లా జైలుకు పంపింది. అయితే జూన్ 25 నాటి సీసీటీవీ ఫుటేజీని సమీక్షిస్తున్నప్పుడు, కరెన్సీ లెక్కింపు గదిలో పలువురు ఇతర బీకేటీసీ ??ఉద్యోగులు అత్యంత అనుమానాస్పదంగా ప్రవర్తించడాన్ని దర్యాప్తు అధికారులు గుర్తించారు.

# పనికిరాని నిబంధనలు రద్దు చేయండి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అగ్నిమాపక శాఖ సేవల ప్రమాణాలను పెంచాలని, రాష్ట్రంలో యూరియా కొరత రాకుండా రైతులకు భరోసా ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

**ఫిర్యాదుల పరిష్కారానికి క్రౌడ్ సోర్సింగ్**

ప్రభుత్వానికి వచ్చే అన్ని ఫిర్యాదుల స్వీకరణకు 'క్రౌడ్ సోర్సింగ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి అర్జీని మానవీయ కోణంలో పరిశీలించి, వేగంగా పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షతో కొందరి భూములను 22ఏ జాబితాలో చేర్చారని, ఇలాంటి వివాదాలను పరిష్కరించడం ద్వారా ఎన్నో అవకాశాలను సృష్టించవచ్చని తెలిపారు. శెట్టిపల్లి భూ వివాదం పరిష్కారంతో ప్రభుత్వానికి రూ.900 కోట్ల విలువైన భూమి రావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర వర్చువల్‌గా పాల్గొనగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్ష అనంతరం, ఆర్టీజీఎస్ రూపొందించిన 'గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్' మాసపత్రికను సీఎం ఆవిష్కరించారు.

# ఉద్యమానికి వెల్లువెత్తుతున్న మద్దతు

**న్యూఢిల్లీ - సూర్యవాస్తవం:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, సీబీఎస్ఈలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమానికి దేశంలోని వివిధ వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతోంది. జూన్ 20న జంతర్‌మంతర్ వద్ద ప్రారంభమైన ఈ ఆందోళనకు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, కార్యకర్తలు, పౌర సమాజం నుంచి మద్దతు లభించింది. మరికొందరు తమ పూర్తి సంఘీభావాన్ని తెలిపారు. మరోపక్క సీజేపీ చేపట్టిన ఈ ఆందోళన మంగళవారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. అలాగే పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష 17వ రోజు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిశీ, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి శంకర్‌సింగ్ వాఘేలా, సినీ నటి స్వరా భాస్కర్, ఎన్సీపీ ఎంపీ ప్రియా సరోజ్, ఎన్సీపీ ఎమ్మెల్యే రోహిత్ పవార్, బీకేయూ అధ్యక్షుడు నేత గుర్నామ్ సింగ్ చరునిలు సీజేపీ ఆందోళన చేస్తున్న శిబిరాన్ని సందర్శించారు. సోనమ్ వాంగ్‌చుక్ దీక్షకు, సీజేపీ ఆందోళనకు మద్దతు తెలిపారు. ప్రముఖ నటి జీనత్ అమన్, నటుడు ఓమీ వైద్య, 'ధురందర్' నటి అయేషా ఖాన్, నటుడు అభయ్ డియోల్ సంఘీభావం తెలిపారు. నటుడు అతుల్ కులకర్ణి కూడా సీజేపీ ఆందోళనకు మద్దతు తెలిపారు.'నిజాయితీ, కరుణతో ఈ దేశాన్ని పునర్నిర్మించండి' అని ఆయన యువతను కోరారు. 'రేపు ఒక ముఖ్యమైన రోజు. నా ఆశ మీపైనే ఉంది" అని కూడా ఆయన పేర్కొన్నారు. గాయకుడు, కళాకారుడు కాకా సైతం సీజేపీ ఆందోళనకు, సోనమ్ వాంగ్‌చుక్ దీక్షకు సంఘీభావం తెలిపారు.అలాగే సీనియర్ నటులు నసీరుద్దీన్ షా, రత్న పాఠక్ షా, రచయిత్రి అరుంధతి రాయ్, ఆర్థికవేత్త జయతీ ఘోష్‌లతో సహా పలువురు ప్రముఖ రచయితలు, నటులు, విద్యావేత్తల బృందం కూడా మద్దతు తెలిపింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు నాయకత్వం వహించినందుకు నిరసనకారులకు తాము "అపారమైన కృతజ్ఞతలు" తెలుపుతున్నామని, అయితే వారి ఆరోగ్యం క్షీణిస్తుండటం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామని సంయుక్త ప్రకటనలో తెలిపారు.

# తుది తీర్పు వరకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోండి

### - భోజశాల కాంప్లెక్స్ కేసులో నమాజ్‌పై సుప్రీం

**భోపాల్ - సూర్యవాస్తవం:**

మధ్యప్రదేశ్ భోజశాల కాంప్లెక్స్ కేసులో తుది తీర్పు వెలువడే వరకు నమాజ్ కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని ముస్లిం వర్గాలకు సుప్రీంకోర్టు సూచించింది. భోజశాల కాంప్లెక్స్ కేసులో అప్పీల్ దాఖలు చేసిన ముస్లిం వర్గాలకు మంగళవారం నోటీసు జారీ చేసింది. ఈ కేసులో ఎటువంటి స్టేటస్ కో లేదా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో తుది తీర్పు వెలువడే వరకు, శుక్రవారాల్లో మధ్యాహ్నం 1.00గంట నుండి 3.00గంటల మధ్య నమాజ్ చేసుకునేందుకు వీలుగా తాత్కాలిక ఏర్పాటుగా వివాదాస్పద స్థలానికి సమీపంలో ఉన్న బహిరంగ ప్రదేశం లేదా ఖాళీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించింది. వివాదాస్పద కట్టడంలో ఎటువంటి నిర్మాణపరమైన మార్పులు చేయవద్దని, సుప్రీంకోర్టు అనుమతి లేకుండా అలా చేయకూడదని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ)ని ఆదేశించింది. వివాదాస్పద భోజశాల కాంప్లెక్స్‌ను సరస్వతి దేవీ ఆలయంగా మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రకటించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్‌లను తక్ష?ణమే జాబితా చేసేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. ఈ కాంప్లెక్స్ 11వ శతాబ్దపు కట్టడమైన కమల్ మౌలా మసీదు అని ముస్లిం వర్గాలు వాదిస్తుండగా, సరస్వతీ దేవీ ఆలయమని హిందూ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ధార్ జిల్లాలోని ఈ కాంప్లెక్స్‌ను ప్రస్తుతం ఎఎస్ఐ సంరక్షిస్తోంది.

# మాజీ మంత్రి ముద్రగడ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. ముద్రగడ మృతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌సిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పితృసమానులైన ముద్రగడ పద్మనాభం మరణం తనను తీవ్రంగా కలిచివేసిందని జగన్ పేర్కొన్నారు.

**ముద్రగడ నేపథ్యం..**

1953 జనవరి సీపీకిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం జన్మించారు. ఆయన తండ్రి ముద్రగడ వీరరాఘవరావు ప్రత్తిపాడు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా రెండు సార్లు గెలుపొందారు. వీరరాఘవరావు 1977లో మృతి చెందారు. దీంతో పద్మనాభం రాజకీయాల్లోకి వచ్చారు. 1978లో తొలిసారి జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్‌టిఆర్ పిలుపు మేరకు 1982లో టిడిపిలో చేరారు. 1983, 1985లో ఆ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి విజయం సాధించారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాకినాడ నుంచి ఒకసారి ఎంపిగా విజయం సాధించారు. మాజీ ముఖ్యమంత్రులు ఎన్‌టిఆర్, చెన్నారెడ్డి కేబినెట్ లలో మంత్రిగా పనిచేశారు. 1994లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన మొదటిసారి ఓడిపోయారు. 2009లో పిఠాపురం నుంచి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2024 ఎన్నికల ముందు వైసిపిలో చేరారు.

**కాపు ఉద్యమ నేతగా..**

కాపు ఉద్యమ నేతగా ముద్రగడకు ప్రత్యేక ముద్ర ఉంది. కాపులను బిసిల్లో చేర్చాలంటూ ఆయన ఉద్యమాలు చేశారు. 1994లో తొలిసారి తన భార్యతో కలిసి ఆమరణ దీక్షకు దిగారు. అనంతరం కాపుల రిజర్వేషన్ల కోసం మరో ఆరుసార్లు ఆమరణ నిరాహార దీక్షలు చేశారు. 2016లో తునిలో కాపు ఐక్య గర్జన సభను నిర్వహించారు. ఈ సమయంలో ఆందోళనకారులు రత్నాచల్ ఎక్స్ ప్రెస్ రైలుకు నిప్పు పెట్టడంతో ఈ ఘటన జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.

**ముద్రగడ మరణం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాసనసభ్యుడిగా, లోక్‌సభ సభ్యుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగా సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడారని మంగళవారం ఒక ప్రకటనలో కొనియాడారు. ఆయన మరణం పట్ల సంతాపం, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**నమ్మిన సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం చేసిన ముద్రగడ : కేసీఆర్**

ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన మాజీ మంత్రి, సీనియర్ రాజకీయవేత్త, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మరణం పట్ల, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సంతాపం ప్రకటించారు. పలుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా పనిచేసిన ముద్రగడ గొప్ప ప్రజా నాయకుడనీ, ముఖ్యం గా కాపు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి గొప్పదని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఫిఫా వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్‌లు..

(మొదటి పేజీ తరువాయి)

క్రీడాభిమానులు ప్రత్యేక స్క్రీనింగ్‌ల ద్వారా వీక్షించే అవకాశం లభించింది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం వెల్లడించారు. జులై 14, 15, 19 తేదీల్లో ఈ ప్రత్యేక మినహాయింపు అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వివిధ దేశాల మధ్య ఉన్న సమయ వ్యత్యాసం కారణంగా, ఈ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాతే ప్రసారం కానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "ఫుట్‌బాల్ క్రీడ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తుంది. అభిమానుల అభ్యర్థన మేరకు బెంగళూరులో ఆహార సేవల సమయాన్ని అర్ధరాత్రి 1 గంట నుంచి 3:30 గంటల వరకు పొడిగిస్తున్నాం. ప్రజా భద్రత, శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు. కర్ణాటక పోలీస్ చట్టం నిబంధనల ప్రకారం ఇందుకు సంబంధించి తక్షణ ఉత్తర్వులు జారీ చేయాలని బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయం ఫుట్‌బాల్ అభిమానులతో పాటు ఆతిథ్య సేవల రంగానికి కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

# బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

కష్టాన్ని మత్స్యకారులు చెప్పుకున్నారు.. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 1న ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. కేవలం పది మైళ్ల దూరంలోనే ఘటన జరిగింది. జులైన 4న చిన్నా ఫోన్‌చేసి ఇంటికొస్తున్నామని చెప్పాడు. దురదృష్టవశాత్తు పోన్ చేసిన కాసేపటికే బోటు ప్రమాదం జరిగింది. ఫిషరీస్ అధికారులు కూడా స్పందించలేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోటు ప్రమాదం జరిగిందని అధికారులకు మెసేజ్ చేశారు. రాత్రి 10:30కి కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టారు. వెంటనే స్పందిస్తే గంటల్లోనే మత్స్యకారులు దొరికేవారు. వెంటనే కోస్ట్‌గార్డ్ వచ్చి ఉంటే ఐదుగురైనా బతికేవారు. ఈనెల 5న చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడారు. తప్పుడు జరిగింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారు. త్రీమెన్ కమిటీ నివేదిక అంతా తప్పుల తడక. చంద్రబాబు ప్రభుత్వానికి మానవత్వం ఉందా? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే ఒక్క అధికారి రాలేదు. ఉత్తరాంధ్ర మంత్రులు ఒక్కరు కూడా రాలేదు. బాధితులను ఫిషరీష్ మంత్రి కూడా పరామర్శించలేదు. బాధితుల వద్దకు మంత్రులను పంపాలని సీఎంకు తెలియదా?. రాత్రికి రాత్రే స్పందిస్తే మత్స్యకారులు బతికేవారు. ఎక్స్ గ్రేషియా కింద అరకొర సాయం చేశారు. బాధితులకు రూ.కోటి చొప్పన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఏడుగురు మత్స్యకారులకు కుటుంబాలకు పరిహారం అందాలన్నారు. 5 లక్షలు ముష్టి వేస్తున్నావా.. ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు, కొత్త ఇల్లుమన ప్రభుత్వం వచ్చాక నెలలోపే ఆదుకుంటాం. గతంలో మా ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా ఉండేది. 2018 పాదయాత్రలో మత్స్యకారులకు ఇచ్చిన మాట నెరవేర్చాం. పాక్‌లో చిక్కుకున్న మత్స్యకారులను సేఫ్‌గా తీసుకొచ్చాం అని వైఎస్ జగన్ గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకారుల కోసం 10 ఫిషింగ్ హార్బర్‌లకు శ్రీకారం చుట్టాం. మరో 6 ఫిష్ ల్యాండ్‌పనులు కూడా చేపట్టాం. ఈ రోజు ఫిషింగ్ హార్బర్‌లను స్కామ్‌లతో అమ్మేస్తున్నారు. ఏపీలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ప్రభుత్వ స్కూల్ పిల్లలకు బుక్స్, యూనిఫాంలు లేవు. రాష్ట్రంలో రైతు రో÷-డడెక్కే పరిస్థితి ఉంది. ప్రజలతో బాబు చెలగాటమాడుతున్నారు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మత్స్యకార కుటుంబాలకు జగన్ అండ

### - ఒక్కో కుటుంబానికి 7లక్షల సాయం ప్రకటన

**విశాఖపట్నం- సూర్యవాస్తవం:** మత్స్యకార కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు దీని గురించి వివరాలు తెలిపారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.7 లక్షల చొప్పున అందిస్తామని కేకే రాజు చెప్పారు. ఈ డబ్బును వైఎస్సార్‌సీపీ తరపున అందిస్తామని అన్నారు. ప్రాణాలతో బయటపడ్డ చిన్నా కుటుంబాన్ని కూడా ఆదుకుంటామని వివరించారు. చిన్నా కుటుంబానికి రూ.7 లక్షల సాయం చేస్తామని చెప్పారు. ఇటీవల విశాఖ తీరంలో జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అదే ప్రమాదంలో మృత్యువుతో పోరాడి ప్రాణాపాయం నుంచి బయటపడిన కారి చిన్నాను కూడా వైఎస్ జగన్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## గ్రీన్ ఫీల్డ్ రహదారికి
# అనుమతులివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేయాలని కోరారు. ఈ హైవే నిర్మిస్తే హైదరాబాద్ - విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు, హైదరాబాద్ నుంచి బందరు పోర్ట్‌కు సరకు రవాణా ఎంతో వేగవంతమవుతుందని సీఎం వివరించారు.

**రాజీవ్ రహదారికి ఆరు వరుసల ప్రత్యామ్నాయ రోడ్డు:**

హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఆరు వరుసల కొత్త రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సీఎం కోరారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతుందని సీఎం స్పష్టం చేశారు. ఈ రహదారి నిర్మాణం వల్ల ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలు సృష్టింపబడతాయని తెలిపారు. అలాగే నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, జలాశయాల పరిధిలో ఉండే మన్ననూరు - శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కేంద్ర మంత్రి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ కీలక సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా జీవితంలో ముద్రగడ పాత్ర చిరస్మరణీయం

### - ఆయన మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు
### - సంతాపం ప్రకటించిన సిఎం రేవంత్ తదితరులు

**హైదరాబాద్ - సూర్యవాస్తవం:**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, లోక్ సభ మాజీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం గారి ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాసన సభ్యుడిగా, లోక్ సభ సభ్యుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగా సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడారని కొనియాడారు . మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ముద్రగడ పద్మనాభం పోషించిన పాత్ర చిరస్మరణీయమని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశంలో ఎంతో ప్రభావం చూపించిన విలక్షణ నాయకత్వ లక్షణాలు ఉన్న గొప్ప నాయకులు ముద్రగడ అని అన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఆయన ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ తనదైన ముద్ర వేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. ముద్రగడ పద్మనాభం మరణం రాజకీయ రంగానికి తీరని లోటని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మరణం పట్ల బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో ఆయన తనదైన ముద్ర వేసి, కాపు సామాజిక వర్గ హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ్యుడిగా, మంత్రిగా ప్రజలకు సేవలందించిన ఆయన రాజకీయ ప్రస్థానం చిరస్మరణీయమై నదన్నారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, అనుచరులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు హరీష్‌రావు. ముద్రగడ్డ పద్మనాభం మరణపై రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'ఆయన మరణ వార్త ఎంతో దిగ్భ్రాం÷-రతికి గురి చేసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని సంతాపం వ్యక్తం చేశారు.

## సంపాదకీయం

# యుద్ధంలో సమిధలవుతున్న సామాన్యులు




పశ్చిమాసియాలో నెలకొన్న శాంతియుత పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారిపోయాయి. ఇరాన్ ను లక్ష్యంగా చేసుకుని అమెరికా భీకర దాడులకు దిగింది. ప్రతిగా ఇరాన్ కూడా ఎదురు దాడులకు దిగింది. యుద్ధం మూలంగా కేవలం ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా నే కాకుండా సమీపంలోని లెబనాన్,గల్ఫ్ దేశాలకు తీవ్ర నష్టం కలిగించింది. అటు ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించింది. యుద్ధం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు కొరత ఏర్పడి పలు దేశాలు లాక్ డౌన్ దిశగా అడుగులు వేస్తున్నాయి. యుద్ధం మూలంగా కేవలం ఆస్తి, ఆర్థిక నష్టమే కాదు పెద్ద ఎత్తున ప్రాణ నష్టం కూడా సంభవించింది. ముఖ్యంగా ఇరాన్‌లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ముక్కుపచ్చలారని చిన్నారులు ఎందరో ఉన్నారు. ఎన్నో వందల మంది గాయాలపాలయ్యారు. పరస్పర దాడుల్లో ఆ రెండు దేశాలకు ఏ మేర నష్టం వాటిల్లిందన్న విషయాన్ని పక్కనపెడితే?ఇరాన్ దాడుల్లో భారత్ కు చెందిన ఓ వాణిజ్య నౌక ధ్వంసం కాగా? అందులోని ఓ భారతీయుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది.రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ఆ దేశాలకు చెందిన ఆస్తి, ప్రాణ నష్టాలు సర్వసాధారణమే అయినప్పటికీ? ఆ యుద్ధం కారణంగా ఇతర దేశాలకు.. అది కూడా అలీన ఉద్యమంతో ప్రపంచ శాంతికి బాటలు వేస్తున్న భారత్ లాంటి దేశాలకు నష్టం వాటిల్లుతుండటం గమనార్హం. అమెరికా, ఇరాన్ యుద్ధంలో భారత్ ఏ ఒక్క దేశానికి మద్దతు పలక లేదు. అదే సమయంలో ఇరు దేశాలు చర్చించుకుని ప్రపంచ శాంతికి పాలుపడాలని భారత్ ఆకాంక్షిస్తున్న సంగతీ తెలిసిందే. ఇలాంటి నేపథ్యంలో ఇరాన్ దాడిలో భారత నౌక ధ్వంసం కావడం, అందులోని ఓ భారతీయుడు గల్లంతు కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేందుకు జరుగుతున్న శాంతి ప్రయత్నాలపై తాజాగా జరుగుతున్న పోరాటం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఇక ఈ రెండు దేశాల మధ్య శాంత కల్లేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిపిన రెండు దాడుల కన్నా తీవ్రంగా ఆదివారం ఇరాన్‌లోని 140కు పైగా క్షిపణి, డ్రోన్ కేంద్రాలు, ఆయుధాగారాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ప్రాంతాలపై లక్షిత దాడులు చేసినట్టు ఆమెరికా ప్రకటించింది. 'ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అది మూల్యం చెల్లిస్తున్నది' అని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆన్‌లైన్‌లో పోస్ట్ పెట్టారు. తాము మాత్రమే హ్వార్మూజ్ జలసంధిని నియంత్రించగలమని, దాని ద్వారా పయనించే నౌకలపై చార్జీలు విధించగలమని ఇరాన్ స్పష్టం చేసింది. ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసిందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ బాఘెర్ ఘాలిబాఫ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కాగా, ఇరాన్ క్షిపణులను తాము సమర్థంగా అడ్డుకున్నట్టు ఖతార్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా క్షిపణి శకలాలు పడి ఒక పిల్లవాడు సహా ముగ్గురు పౌరులు గాయపడ్డట్టు తెలిపింది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను తాము కూడా అడ్డుకున్నట్టు కువైట్ మిలిటరీ ప్రకటించింది. ఆదివారం బహ్రెయిన్‌లో పౌరులకు మూడుసార్లు హెచ్చరిక సైరన్లు మోగాయి.సైప్రస్ జెండాతో భారత్ బయలుదేరిన జీఎఫ్ఎన్ గెలాక్సీ నౌకపై ఓమన్ తీరం సమీపంలో హర్మూజ్ జల సంధికి చేరుకున్న సమయంలో ఇరాన్ నుంచి దూసుకువచ్చిన బాంబు పడింది. దీంతో గెలాక్సీ నౌకలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. నౌకలో మంటలు చెలరేగిన సమయంలో అందులో ఉన్న 11 మంది భారతీయులు దానిని వదిలేసి చిన్నపాటి లైఫ్ బోటులో ప్రాణాలు కాపాడుకునే యత్నం చేశారు. ఈ క్రమంలో 10 మంది భారతీయులు చిన్నబోటులో సురక్షిత ప్రాంతానికి చేరుకోగా? మరో వ్యక్తి మాత్రం గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. కాగా, ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిరకు ఇరాన్‌లో 8,531 మంది మరణించారని అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం హెచ్ఆర్ఏఎన్ఏ పేర్కొంది. వీరిలో 5,607 మంది సామాన్య పౌరులు ఉన్నారని తెలపడం గమనార్హం. అంతేకాదు మృతుల్లో 1244 మంది పిల్లలు కూడా ఉన్నారని పేర్కొనడం గుండెతరుక్కుపోయే విషం. క్షేత్రస్థాయి నివేదికలు, స్థానికుల సమచారం, వైద్య, అత్యవసర వనరులు, అధికారిక ప్రకటనల ఆధారంగా తాము ఈ సమాచారాన్ని సేకరించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఆ సమాచారం ఆధారంగా ఇరాన్‌లో 5500 మందికి పైగా చనిపోయారని పేర్కొంది. ఇదిలా ఉండగా అంతర్జాతీయ సంస్థ అయిన రెడ్‌క్రాస్ వాదన మరోతీరు ఉంది. అమెరికా –ఇజ్రాయెల్ దాడుల మూలంగా ఇరాన్‌లో ఇప్పటివరకు కనీసం 3,900 మంది మరణించగా, 60,000 మంది గాయపడ్డారని పేర్కొన్నది. ఇక, మార్చి 2 నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1124 మంది చిన్నారులతో పాటు దాదాపు 3,368 మంది లెబనాన్ పౌరులు మరణించారని లెబనీస్ అధికారులు వెల్లడించారు. అలాగే, లెబనీస్ సాయుధ సంస్థ హిజ్బుల్లాకు చెందిన 400 మంది సైనికులు మరణించారని ఆ సంస్థ ప్రకటించింది. అలాగే ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాక్‌లో 702మంది మరణించారు.ఇరాన్ దాడికి ఖండిస్తూ ఆ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. దాడి జరిగిన సమయంలో ఓమన్ ప్రభుత్వం వేగంగా స్పందించి? ప్రమాదంలో పడిన భారతీయులను కాపాడిందని ఆ శాఖ తెలిపింది. భారతీయులను కాపాడిన ఓమన్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. గల్లంతైన వ్యక్తి కోసం ఓమన్ దేశ సహాయక సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టినట్లు తెలిపింది.

# రావణ్ విషయంలో నేతల యూ టర్న్

**విజయవాడ – సూర్య వాస్తవం**

ఏపీలో ఆసక్తి రేకెత్తించిన జోసెఫ్ రావణ్ అలియాస్ ప్రశ్న రావణ్ వ్యవహారంపై కొత్త కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. జనసేన అదినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై అసభ్య పదజాలాన్ని ప్రయోగించిన కేసులో అరెస్టు అయిన రావణ్ కు న్యాయ సహాయం చేసిన ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్? తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ప్రశ్న రావణ్ తో తనకు అంతగా సంబంధాలేమీ లేవని చెప్పిన శ్రావణ్? రావణ్ కు అతడి కుటుంబం నుంచి కూడా పెద్దగా మద్దతు లేదని సంచలన వ్యాఖ్య చేశారు. రావణ్ వ్యవహారంలో విపక్ష వైసీపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని కూడా శ్రావణ్ ఆరోపించారు.ప్రశ్న రావణ్ తో తనకు పెద్దగా స్నేహమే లేదని శ్రావణ్ తెలిపారు. ఆకివీడు వ్యవహారంలోనే తనకు రావణ్ తో పరిచయం అయ్యిందని, ఆ తర్వాత తన ఇంటర్వ్యూ కోసం రావణ్ తనను సంప్రదించారని తెలిపారు. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా కేవలం ఒకటి రెండు సార్లు మాత్రమే తాను రావణ్ తో ఫోన్ లో మాట్లాడానని ఆయన తెలిపారు. అంతకుమించి రావణ్ తో తనకు ప్రత్యక్ష సంబంధాలేమీ లేవని కూడా ఆయన పేర్కొనడం గమనార్హం. ఇక ఓ బాధ్యత కలిగిన సామాజిక వేత్తగా, న్యాయవాదిగా మాత్రమే తాను రావణ్ కేసులను వాదించానని, అంతకుమించి రావణ్ తో తనకు మైత్రి లేదని ఆయన తేల్చేశారు.ఇక రావణ్ ఓ రేంజిలో ఎలివేట్ కావడానికి దారి తీసిన ఏలూరు బహిరంగ సభలో అంతా తన ప్రమేయం లేకుండానే జరిగిపోయిందని శ్రావణ్ పేర్కొన్నారు. ఆ సభలో వేదిక మీదకు వచ్చేవారిలో రావణ్ పేరే లేదని ఆయన అన్నారు. ఆహ్వానితుల జాబితాలో పేరు లేకున్నా.. సభ నిర్వాహకుడిగా ఉన్న తన అనుమతి లేకుండానే రావణ్ వేదిక మీదకు వచ్చారని, అంతేకాకుండా తనకంటే ముందుగానే తన అనుమతి లేకుండా రావణ్ మైకందుకుని మరీ ప్రసంగించారని ఆయన ఆరోపించారు. అయితే వేడిపై శ్రవణ్ అన్న రమ్మంటేనే వచ్చానని రావణ్ మాట్లాడడం గమనార్హం. రావణ్ చేసిన ఘాటు వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కూడా ఆయన తేల్చేశారు. తాను నిర్వహించిన సభలో తన అనుమతి లేకుండా మాట్లాడిన రావణ్ అరెస్టు అయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ మాటలు చూస్తుంటే జడ శ్రవణ్ ఈ కేసు నుండి తప్పుకు నేందుకు ప్రయత్నిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక రావణ్ కు వైసీపీ మద్దతు




పలుకుతున్న వైనంపైనా శ్రావణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అదికార కూటమికి చెందిన కీలక నేతలపై పరుష పదజాలంతో విరుచుకుపడుతున్న ప్రతి ఒక్కరికి వైసీపీ నుంచి మద్దతు లభిస్తోందని ఆయన అన్నారు. అందులో భాగంగానే రావణ్ కు వైసీపీ నుంచి మద్దతు లభించిందని ఆయన అన్నారు. అయితే రావణ్ హిందూ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిన తర్వాత వైసీపీ అతడి నుంచి దూరం జరగాలని భావించిందని, అయితే అది అంత ఈజీ కాదన్న విషయం తెలుసుకుని వైసీపీ నేతలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. తనకు మాత్రం వైసీపీ నుంచి ఎలాంటి మద్దతు లేదని ఆయన అన్నారు. ఎంగిలి మెతుకులనూ విదల్చని మాదిరిగా వ్యవహరిస్తున్న వైసీపీ నుంచి తనకు ఎలాంటి సాయం అవసరం లేదని కూడా ఆయన ఘాటు వ్యాఖ్య చేశారు.ఇక రావణ్ వ్యవహారంలో పరిమితికి మించి స్పందిస్తున్న ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ వ్యవహారంపైనా శ్రావణ్ స్పందించారు. రావణ్, ప్రకాశ్ రాజ్ ల మధ్య చాలా కాలం నుంచే పరిచయం ఉన్నట్టుందని ఆయన వ్యాఖ్యానించారు. రావణ్ గురించి మాట్లాడేందుకే ప్రకాశ్ రాజ్ తనకు పలుమార్లు కాల్ చేశారని ఆయన చెప్పారు. ఇక రావణ్ కు అతడి కుటుంబం నుంచి ఎలాంటి మద్దతు లేదని చెప్పారు. రావణ్ కు న్యాయ సహకారంతో పాటుగా ఇతరత్రా సాయాన్ని కూడా తానే చేస్తున్నానని తెలిపారు. రావణ్ కు అన్నీ తానై సాయం చేస్తుంటే? అతడి బృందంలోని గమన అనే యువతి వైసీపీ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన తీరుపై శ్రావణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**దారిలోకి వచ్చిన ఎబీవీ**

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీవీ వెంకటేశ్వరరావు గత వైసీపీ పాలనలో ఎదుర్కొన్న ఇబ్బందులు తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ఆయన పదవీ విరమణ చేశారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై పలు సందర్భాల్లో తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. గతంలో కూటమి ప్రభుత్వానికి సూచనలు చేసిన సందర్భాల్లోనూ ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు. తాజాగా ఉపా చట్టం (యూఏపీఏ) వినియోగంపై తన అభిప్రాయాన్ని వెల్లడించిన ఏబీవీ, ఒక కార్యక్రమంలో మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుతో వేదికను పంచుకోవడంపై వస్తున్న విమర్శలకు స్పందించారు. ఆ వేదికపై అంబటి రాంబాబు ఏమి మాట్లాడారో తాను వినలేదని, ఆయన పక్కన కూర్చున్నాననే కారణంతో సభ మధ్యలో లేచి వెళ్లిపోవడం సభా మర్యాద కాదని చెప్పారు."మీ అందరితో హీరో అనిపించుకోవడం కోసం నేను సంస్కారం వదిలేయాలా? మీరు నా గురించి పొరబడ్డారు. నేనలాంటి వాడిని కాదు" అంటూ ఏబీవీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గతంలో జగన్ ప్రభుత్వం మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వలేదని, ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరించాలనుకుంటుందా? అని ప్రశ్నించారు.ఇంతకుముందు అమరావతి భూసేకరణ అంశంపైనా ఏబీవీ స్పందించారు. రెండో విడతలో వేలాది ఎకరాల భూమిని సేకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తే ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం కష్టమవుతుందని హెచ్చరించారు. అలాగే అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయకపోతే కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసినట్టేనని వ్యాఖ్యానించారు.అలాగే జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' అంశాన్ని కూడా తేలికగా తీసుకోవద్దని సూచించారు. యూట్యూబ్ వ్యాఖ్యలపై ఉపా చట్టాన్ని ప్రయోగించే విషయంలో రాజద్రోహం కేసు అవసరం లేదని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దీంతో కూటమి కార్యకర్తల నుంచి విమర్శలు రావడంతో, తాను చేస్తున్న వ్యాఖ్యలను సద్విమర్శలుగా స్వీకరించాలని ఏబీవీ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వరుస పోస్టులు చేస్తూ తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు.

# టీడీపీలో భారీ మార్పులు

**విజయవాడ – సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమి పరిపాలనలో దూసుకుపోతున్న తరుణంలో, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ అంతర్గత బలోపేతంపై అత్యంత కీలకమైన వ్యూహాత్మక కసరత్తును ప్రారంభించారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు ఒక భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందులో భాగంగా చాలా మంది సీనియర్లను, యాక్టివ్‌గా లేని నాయకులను పక్కన పెట్టేసి, కొత్త ముఖాలకు, యువ నాయకత్వానికి పెద్దపీట వేయాలని టీడీపీ అధిష్టానం డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి సొంత ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాలపై టీడీపీ అధిష్టానం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. గత ఎన్నికల్లో కొన్ని సమీకరణాల వల్ల వెనుకబడిన ప్రాంతాలు లేదా ఇన్‌ఛార్జ్‌లు సరిగ్గా పని చేయని చోట్ల గ్రౌండ్ లెవెల్ రిపోర్ట్ తెప్పించుకుంటున్నారు. కేవలం పేరుకే ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటూ, క్యాడర్‌ను పట్టించుకోని వారిని మార్చేయాలని చంద్రబాబు గట్టిగా ఉన్నారట. అక్కడ సమర్థులైన, ప్రజల్లో నిరంతరం ఉండే కొత్త నాయకులను ఎంపిక చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. ప్రారంభించిన సీఎం చంద్రబాబుఇక ఈ సమీక్షల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపైనా టీడీపీ అంతర్గతంగా సమీక్షలు నిర్వహిస్తోంది. కూటమి ధర్మం ప్రకారం ఆయా స్థానాలు మిత్రపక్షాలకే ఉన్నప్పటికీ, అక్కడ టీడీపీ ఓటు బ్యాంక్ చెల్లాచెదురు కాకుండా చూసుకోవడం, క్యాడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యవసరం అని భావిస్తున్నారు. భవిష్యత్తు రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, మిత్రపక్షాల స్థానాల్లో కూడా టీడీపీ బలాన్ని తగ్గకుండా చూసుకునేందుకు అంతర్గత సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు, గత ఎన్నికల్లో వైసీపీ గెలుచుకున్న ఆ 11 నియోజకవర్గాలపై టీడీపీ టాప్ ప్రయారిటీ పెట్టింది. ఆ 11 స్థానాల్లో వైసీపీని పూర్తిగా ఖాళీ చేయడమే లక్ష్యంగా కసరత్తు జరుగుతోంది. అక్కడ పార్టీ ఎందుకు ఓడిపోయింది? ఎక్కడ లోపాలు జరిగాయి? అనే విషయాలపై ప్రత్యేక నివేదికలు తెప్పించుకున్నారు. ఆ నియోజకవర్గాల్లో ప్రస్తుత ఇన్‌ఛార్జ్‌ల పనితీరును బేరీజు వేస్తున్నారు. ఒకవేళ వారి వల్ల పార్టీ పుంజుకునే అవకాశం లేదని తేలితే, క్షణం కూడా ఆలోచించకుండా వారిని పక్కన పెట్టి.. ఆర్థికంగా, అంగబలం పరంగా, ప్రజల్లో క్రేజ్ ఉన్న సరికొత్త సమర్థ నాయకులను రంగంలోకి దించేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.ఇక అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈసారి సమీక్షల్లో కేవలం "పనితీరు" మాత్రమే ఏకైక ప్రామాణికం అని చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎంతటి సీనియర్ నాయకుడైనా, గతంలో ఎంత పెద్ద పదవి అనుభవించినా సరే.. ఇప్పుడు క్షేత్రస్థాయిలో యాక్టివ్‌గా లేకపోతే, సమన్వయ కమిటీలు సరిగ్గా నడపకపోతే వారిని తప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. చాలా మంది పాత తరం నేతలను పక్కన పెట్టేసి, కొత్త వారికి, యువతకు ఛాన్స్ ఇవ్వాలనే గట్టి ఆలోచనలో అధిష్టానం ఉంది.

# మాజీ మంత్రి ఓటు గల్లంతు

**గుంటూరు – – సూర్య వాస్తవం**




ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న వేళ మాజీ మంత్రి ఓటే గల్లంతు కావడం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణకుమారి పేరు గుంటూరు నగర ఓటరు జాబితాలో కనిపించక పోవడంతో ఆమె అధికారులను ఆశ్రయించారు. ఒక మాజీ మంత్రి ఓటే లేకపోతే సామాన్య ఓటర్ల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఓటరు జాబితాలో తన పేరు లేదని ఎన్నికల అధికారులు చెప్పడంతో అరుణకుమారి ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన ఓటును పునరుద్ధరించాలని కోరారు.డాక్టర్ శనక్కాయల అరుణకుమారి 1999 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రెండో మంత్రివర్గంలో ఆమెకు మంత్రి పదవి దక్కింది.ఇదిలా ఉండగా, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది. ఇంటింటి సర్వే, డిజిటలైజేషన్ ప్రక్రియకు జూలై 14 చివరి గడువుగా నిర్ణయించారు.

మరణించినవారు, వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, డూప్లికేట్ ఓట్లను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ లక్ష్యం.చివరి రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అధికారులు సవరణ పనుల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు ప్రజలు హెల్ప్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి సమయంలో మాజీ మంత్రి ఓటు గల్లంతు కావడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## అన్న క్యాంటీన్‌కు అండగా డిస్కవర్ అనిల్

### - ఆర్.ఓ. వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు చేసిన డిస్కవర్ అనంతపురం అనిల్







**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** పేద ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే హృదయపూర్వక సంకల్పంతో డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు సామాజికవేత్త ఎ.జి.అనిల్ కుమార్ అనంతపురంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న అన్న క్యాంటీన్‌కు ఆర్.ఓ. వాటర్ ప్యూరిఫైయర్ యూనిట్‌ను విరాళంగా అందించారు.ప్రతిరోజూ అన్న క్యాంటీన్‌కు వచ్చే నిరుపేదలు, కూలీ కార్మికులు, వృద్ధులు, విద్యార్థులు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఆర్.ఓ. యూనిట్ ద్వారా ప్రతిరోజూ సుమారు లి600 నుండి 750 లీటర్ల వరకు శుద్ధి చేసిన తాగునీరులి అందుబాటులోకి రానుంది. దీనివల్ల వందలాది మంది లబ్ధి పొందనున్నారు.ఈ సందర్భంగా ఎ.జి. అనిల్ కుమార్ మాట్లాడుతూ......ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందడం ఒక ప్రాథమిక అవసరం. అన్న క్యాంటీన్లకు వచ్చే పేద ప్రజలకు భోజనంతో పాటు పరిశుభ్రమైన తాగునీరు కూడా అందించాలని భావించి ఈ ఆర్.ఓ. యూనిట్‌ను ఏర్పాటు చేశాం. ఈ కార్యక్రమం ఎంత మేరకు విజయవంతమవుతుందో పరిశీలించిన అనంతరం, అనంతపురంలోని అన్ని అన్న క్యాంటీన్లలో కూడా ఇలాంటి ఆర్.ఓ. వాటర్ ప్యూరిఫైయర్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తాము."లి అని తెలిపారు.సామాజిక సేవ, ప్రజారోగ్యం మరియు సమాజ సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్న డిస్కవర్ అనంతపురం మరోసారి ప్రజల అవసరాలను గుర్తించి ఒక ఆదర్శవంతమైన కార్యక్రమాన్ని చేపట్టింది.

## 16, 17న అనంత జిల్లాకు ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మిరెడ్డి రాక

### - జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ వెల్లడి



**అనంతపురం - సూర్య వాస్తవం :** ఈనెల 16,17వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ ఇ.లక్ష్మిరెడ్డి అనంతపురం జిల్లాలో పర్యటించడం జరుగు తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు ఇ.లక్ష్మిరెడ్డి జిల్లాలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం మరియు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, ఎఫ్ పి షాప్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు మరియు బాలింతలకు, గర్భవతులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా తదితర అంశాలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని వసతి గృహాల సంక్షేమ అధికారులు, సివిల్ సప్లై అధికారులు, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుల కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

## భళారే బండి దక్షిత్

### - 13 జాతీయ స్కేటింగ్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ




**అనంతపురం - సూర్య వాస్తవం :** దక్షిత్ అనంతపురం నగరంలోని లక్ష్మి సినర్జీ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నా విద్యార్థి ప్రతిభ కాకినాడ లో జరుగుతున్న 13 వ జాతీయ స్కేటింగ్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన బండి దక్షిత్ వెండి పతకం సాధించాడు. బండి హెడ్ కోచ్ నాగేంద్ర, కోచ్ అకిల్ సర్ నేతృత్వంలో ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా అనంతపురం నగరవాసులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జీవో 77ను రద్దు చేయాలి

## విద్యా రంగ పరిరక్షణకు కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ అర్ధనగ్న నిరసన






**అనంతపురం/ ఉరవకొండ - సూర్య వాస్తవం ప్రతినిధి :** ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను పరిరక్షించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు తిరిగి చెల్లింపు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీవో 77ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో మాట్లాడిన నాయకులు రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ , ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.6,400 కోట్ల ఫీజు తిరిగి చెల్లింపు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాటి యువగళంలో ఇచ్చిన మాట వైస్సార్సీపీ ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకుండా జీఓ 77 రద్దు చేసి విద్యార్థులను మోసం చేస్తోంది అని మనం అధికారంలోకి వచ్చినప్పుడు వెంటనే బకాయిలు చెల్లించి జీఓ 77 రద్దుచేస్తామన్నారు. ఇప్పటికి కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల కాలం గడిచిపోయింది. ఇప్పటికి మీకు విద్యార్థుల మీద దయ కలగ లేదా బకాయిలు అందక ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తు న్నాయని ఆరోపించారు. వెనుకబడిన తరగతులు,వెనుకబడిన కులాలు, వెనుకబడిన తెగలు, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నాణ్యమైన భోజనం, స్వచ్ఛ మైన తాగునీరు, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు అన్యాయం చేస్తున్న జీవో 77ను వెంటనే రద్దు చేసి, ప్రైవేటు పీజీ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులందరికీ ఫీజు తిరిగి చెల్లింపు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాణ త్యాగం చేసైనా... ప్రెస్‌క్లబ్‌ను కాపాడుకుంటాం ....!

- సీనియర్ జర్నలిస్ట్ చెరుకూరి రామాంజనేయులు
- నేటి నుండే ఆమరణ నిరాహార దీక్ష



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా లో వందలాది మంది జర్నలిస్టుల జీవితాలతో ముడిపడి ఉన్న అనంతపురము ప్రెస్ క్లబ్ ను ప్రాణత్యాగం చేసైనా కాపాడుకుంటామని సీనియర్ జర్నలిస్ట్ చెరుకూరి రామాంజనేయులు తెలియజేశారు. అనంతపురం ప్రెస్‌క్లబ్‌కుతక్షణం ఎన్నికలు నిర్వహించాలనే ప్రధాన డిమాండ్‌తో ప్రెస్‌క్లబ్ ఎదుట జర్నలిస్టులు చేపట్టిన రిలే దీక్ష మంగళవారం మూడో రోజుకు చేరుకుంది. ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయ పార్టీలకు, జర్నలిస్టు యూనియన్లకు అతీతంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు స్వచ్ఛందంగా చేస్తున్న ఈ దీక్షలను చూసి ఎందరో ప్రజాస్వామ్యవాదులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. అయితే జిల్లా అధికార యంత్రాంగం నుండి గాని, ఎన్నికల కోసమే గత ఆరునెలల కిందట ఏర్పాటైన తాత్కాలిక హడ్ హక్ కమిటీ సభ్యుల నుండి గాని దీక్షపరులకు ఎలాంటి స్పష్టమైన హామీలేని కారణంగా ఆందోళన కార్యక్రమం మరింత ఉధృతం చేస్తున్నట్లు ప్రకటించారు.

**మూడవరోజు దీక్షలకు మద్దతు తెలిపిన వారిలో....**

**మద్దతు తెలిపిన వారిలో..**

జై భీమ్ రామాంజనేయులు, సురేష్, ఎస్సీ జన సంఘం రాష్ట్ర నాయకుడు దాసగారి కుల్లాయప్ప, ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు సాకే హరి, మాల మహానాడు అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త డిస్కవర్ అనిల్ కుమార్ రెడ్డి, ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపకులు కేపీ రాజు, శంకర్ రెడ్డి, బేడ బుడగ జంగం రాష్ట్ర కార్యదర్శి సిరిశాల అంజి, గిరిజన నాయకులు బాబు నాయక్, ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు పవన్ శ్రీధర్ రమణ, ఏఐఎస్ బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృధ్వి, మద్దెల చెరువు మల్లీ, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి, ఇన్సాఫ్ అధ్యక్షుడు జాఫర్, కూడేరు మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలియజేశారు.



**నేటి నుంచే ఆమరణ నిరాహార దీక్ష**

అనంతపురం ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి ఏకైక కారణమైన ఎన్నికలు నిర్వహించాలనే ప్రధాన డిమాండ్‌తో నేటి నుంచి(15-7-2026) ఆమరణ నిరాహార దీక్షలకు పోతున్నట్లు దీక్షలో కూర్చున్న పలువురు సీనియర్ జర్నలిస్టులు చెరుకూరి రామాంజనేయులు, రవి, రామ్మూర్తి, హరి, భాస్కర్ తదితరులు తమ స్పష్టమైన వైఖరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, కుల ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు.

## కార్పొరేషన్ ఉద్యోగం కత్తి మీద సాము లాంటిది

### - స్టాకు రికార్డుల మేరకే పెట్టుకోవాలి
### - స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి



**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :** కార్పొరేషన్ ఉద్యోగాలు కత్తి మీద సాములాంటివని రికార్డులు సరిగా పెట్టుకోకపోతే ఉద్యోగరీత్యా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ కార్పొరేషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన శ్రీ సత్య సాయి జిల్లా పర్యటనలో భాగంగా కదిరి అనంతపురం జాతీయ రహదారి సమీపంలో ఉన్న ప్రభుత్వ చౌక ధాన్యపు డిపో గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన బియ్యం క్వాలిటీ తూకాలు అన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఒక్కొక్క బస్తా ఎన్ని కిలోలు ఉందో అక్కడ ఉన్న కూలీల ద్వారా స్కేలు పైన వేయించి తూనికలు కొలతల అధికారి ద్వారా సరైన తూకం ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా చౌక ధాన్యపు డిపోలకు సరఫరా చేసే బియ్యం ఏ ఏ ప్రాంతాల నుంచి వస్తున్నాయి సరైన తూకం వస్తుందా లేదా అని ఆరా తీశారు వీటితోపాటు చక్కెర కంది బేడలు కూడా నాణ్యంగా ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి సివిల్ సప్లై అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అండర్ 14 మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

### - ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, హెచ్‌ఎం సుంకన్న



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం ఫుడ్ బాల్ గ్రౌండ్ నం దు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వా రి ఆదేశాల మేరకు ఈ రోజు నుండి ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీల కార్యక్రమంలో పాల్గొన్న ము న్సిపల్ కమీషనర్ బి. జబ్బార్ మి యా ఈ సందర్భంగా కమీషనర్ క్రీ డా కారులను ఉద్దేశించి మాట్లాడు తూ విద్యార్థులు అందరూ క్రీడా స్ఫూర్తితో గెలిచి తమ స్కూళ్లకు,ఉ పాధ్యాయులుకు,కోచ్ లకు మంచి పేరు తీసుకురాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపా ధ్యాయులు పుష్పరాజ్,నూర్ మ హమ్మద్,శ్యామల,సరోజ,యోగ గు రువు కృష్ణయ్య,వీటిలో ఆనంద్ మ రియు వాలీబాల్ అథెటిక్స్ పోటీలు నిర్వహించారు మండలలోని అన్ని యజమాన్యాలు పాఠశాలలో చదు వుతున్న బాల బాలికలు పాల్గొన్నా రు.

## అంగన్‌వాడీలు, పాఠశాలల్లో నాణ్యత లేని

# ఆహారం సరఫరా చేస్తే కఠిన చర్యలు

- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఇ.లక్ష్మీరెడ్డి
- మోడల్ అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల్లో విస్తృత తనిఖీలు
- నియమాలు ఉల్లంఘించిన అధికారులు, సరఫరాదారులకు షోకాజ్ నోటీసులు



**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం, జూలై 14:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంపూర్ణ పోషణ మరియు మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఇ.లక్ష్మీరెడ్డి హెచ్చరించారు. ఆయన తన పర్యటనలో భాగంగా మోడల్ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి రికార్డులను మరియు లబ్ధిదారులకు అందుతున్న పౌష్టికాహార నాణ్యతను నిశితంగా పరిశీలించారు.

**ఓడీసీ మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ -- తీవ్ర అసంతృప్తి...**

ఓడీసీలోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కమిషన్ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.
నిబంధనల ప్రకారం లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేయాల్సిన కోడిగుడ్లపై కలరింగ్ (ముద్ర) లేకపోవడాన్ని ఆయన గుర్తించారు.సరఫరా చేస్తున్న కోడిగుడ్ల బరువు, నాణ్యత కూడా ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాల ప్రకారం లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.పర్యవేక్షణలో విఫలమైనందుకు ఐసీడీఎస్ సీడీపీఓ కు, మరియు నిబంధనలను ఉల్లంఘించి నాణ్యత లేని గుడ్లు సరఫరా చేసిన ఎగ్ వెండర్ కు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

**ఆమడగూరు ఏపీ మోడల్ స్కూల్ లోపాలు..**

ఆమడగూరులోని ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించిన లక్ష్మీరెడ్డి గారు అక్కడ కూడా లోపాలను గుర్తించారు.
గడిచిన రెండేళ్లుగా ఇక్కడ కలరింగ్ (ముద్ర) లేని కోడిగుడ్లనే సరఫరా చేస్తున్నట్లు ఆయన గుర్తించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.మెనూ ప్రకారం కనీస పోషక పదార్థాలు పాటించడం లేదని, స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించడం లేదని తేలింది.ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన స్కూల్ ప్రిన్సిపాల్ ఇన్‌ఛార్జ్‌కు, స్టోర్ ఇన్‌ఛార్జ్ తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

**ఆమడగూరు జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన తనిఖీ...**

ఆమడగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేయగా అక్కడ కూడా నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజూ అందించాల్సిన కోడిగుడ్లను వారానికి కేవలం 2 సార్లు మాత్రమే సరఫర చెస్తున్నట్లు ఆయన పరిశీలనలో తేలింది.పాఠశాలలో ముద్ర లేని కోడిగుడ్లు ఉండటాన్ని గమనించి, వాటి స్థానంలో తక్షణమే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముద్ర ఉన్న గుడ్లను మార్పిడి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనంలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించనందుకు గాను జిల్లా విద్యాశాఖాధికారి తో మాట్లాడి, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖాధికారి కి విచారణ జరిపి తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వంశీ కృష్ణ రెడ్డి, సివిల్ సప్లైస్ డిఎం రాజు నాయక్, ఐసిడిఎస్ పిడి ప్రమీల, సమగ్ర శిక్ష అభియాన్ ఏజిసిడివో అనిత, మిడ్ డే మిడ్స్ ఎడి వినయ్ ప్రసాద్ బిసి సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎవరి ముక్కుల్లో పెడతారు ఇంత కొంచెం గోంగూర

- మెనూ పాటించని ప్రభుత్వ గిరిజన బాలుర వాసతి గృహ వార్డెన్
- వార్డెన్ పై మండిపడ్డ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి



**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం :** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో నిజాలు వెలుగులోకి వచ్చాయి ఈ వసతి గృహంలో సుమారు 120 మంది విద్యార్థులు విద్యను అభ్యసి స్నారు అయితే ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి మంగళవారం సాయంత్రం వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్ కమిషన్ సభ్యునికి విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పాటించకుండా వార్డెన్ కు ఇష్టం వచ్చిన విధంగా వంటలు చేయించడంపై లక్ష్మి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు చాలీచాలని కోన్ కూర ఎవరి ముక్కుల్లో పెడతావ్ కొంచమైనా అర్థమవుతుందా ఆ పిల్లలను చూస్తూనే తమకు అర్థమవుతుంది వాళ్ళు ఎలా ఉన్నారనే విషయం అంటూ వార్డెన్ మంజునాథ పై మండిపడ్డారు. ఇప్పటినుంచి అయినా ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని ఆదేశాలు జారీ చేశారు అనంతరం కూరగాయలు వంటకు ఉపయోగించే ఇతర సామాగ్రిని పరిశీలించారు

**కేజీబీవీ స్కూల్, హాస్టళ్లు, ఎంఎల్ ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసిన రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఇ. లక్ష్మీ రెడ్డి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఇ. లక్ష్మీ రెడ్డి మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కదిరి పట్టణంలోని ఎం ఎల్ ఎస్ పాయింట్‌ను, తలుపుల మండలంలోని కేజీబీవీ పాఠశాల, అలాగే కదిరి ట్రైబల్ సంక్షేమం గురుకుల పాఠశాల కదిరి రూరల్ పరిధిలోని కాలసముద్రం వద్ద వున్నా సోషల్ సంక్షేమం గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార కమిషన్ సభ్యులు ఇ. లక్ష్మీ రెడ్డి ఆయా కేంద్రాలలో అందుతున్న సేవలు, ఆహార నాణ్యతను నిశితంగా పరిశీలించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కదిరి ఎం.ఎల్.ఎస్ పాయింట్‌ను పరిశీలించిన ఆయన, కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యం నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. గిడ్డంగిలో నిల్వలు, పంపిణీ రికార్డులను పరిశీలించి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా అర్హులకు సరైన పరిమాణంలో, నాణ్యమైన రేషన్ అందించాలని అధికారులను ఆదేశించారు. తలుపుల కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వంటశాల పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల సిబ్బందికి స్పష్టం చేశారు.కాలసముద్రం వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లను తనిఖీ చేసి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న భోజన వసతులు, నిత్యావసర సరుకుల సరఫరాపై ఆరా తీశారు. వార్డెన్లు నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం పేదలు, విద్యార్థుల కొరకు సరఫరా చేస్తున్న ఆహార ధాన్యాల పంపిణీలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా లక్ష్మీ రెడ్డి గారు హెచ్చరించారు. ఆహార భద్రతా చట్టం కింద లబ్ధిదారులకు అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడటం సంక్షేమ నిలయాల నిర్వాహకులు, సరఫరా అధికారుల కనీస బాధ్యతని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో డిఎస్ఓ వంశీ కృష్ణ రెడ్డి, సమగ్ర శిక్ష ఏ జి సి డి వో అనిత,సివిల్ సప్లైస్ డిఎం రాజు నాయక్ .బిసి సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి,గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రామ్ ఇతర హాస్టల్ వార్డెన్లు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# జొన్నగిరి గోల్డ్ మైన్స్ విస్తరణ




**కర్నులు – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక మరియు గనుల రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుందికర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ 'జొన్నగిరి గోల్డ్ మైన్స్'బంగారు గనులు) ప్రాజెక్టు విస్తరణకు ప్రభుత్వం భారీగా భూములను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా మరో 998 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ భూసేకరణలో భాగంగా ఏపీ దేవాదాయ శాఖకు చెందిన భూములను కూడా వినియోగించుకోనున్నారు.దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 40 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన లీజు నిబంధనలు మరియు ప్రక్రియను పూర్తి చేస్తూ ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు విస్తరణ ద్వారా రాయల్టీ మరియు పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది. అంతేకాకుండా, ఈ మైనింగ్ పనులు పూర్తిస్థాయిలో ఊపందుకుంటే కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. బంగారు గనుల తవ్వకం మరియు ప్రాజెక్ట్ పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టు విస్తరణకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జొన్నగిరి గోల్డ్ మైన్స్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.

# ప్రజల భద్రతకు పెద్దపీట

- కదిరిలో ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కరింగ్ కార్యక్రమం ప్రారంభం
- జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్




**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం :** కదిరి పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా ఎదురుగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆటోలకు క్యూఆర్ కోడ్ (ు= జశీఎవ) స్టిక్కర్లతో కూడిన నెంబర్ల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) ఎస్. సతీష్ కుమార్,జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ , కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ... ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా జిల్లావ్యాప్తంగా ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్టిక్కరింగ్ ద్వారా ఆటో డ్రైవర్ వివరాలు, వాహన సమాచారం ప్రయాణికులకు సులభంగా అందుబాటులో ఉంటాయని, దీనివల్ల నేరాల నియంత్రణతో పాటు సురక్షిత ప్రయాణానికి వీలవుతుందని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ... జిల్లా యంత్రాంగం మరియు పోలీసు శాఖ సమన్వయంతో ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, ఈ క్యూఆర్ కోడ్ విధానం ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మంచి మార్పుకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు.ఆటో వెనుక భాగంలో మరియు ప్రయాణికులకు కనిపించే విధంగా ఈ ప్రత్యేక క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను అతికిస్తారు.ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్ ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆటో యజమాని, డ్రైవర్ పేరు, ఫోన్ నెంబర్ మరియు వాహన రిజిస్ట్రేషన్ వివరాలను తక్షణమే తెలుసుకోవచ్చు.అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు సులభంగా అలర్ట్ అయ్యేందుకు మరియు పోలీసులకు సమాచారం అందించేందుకు ఇది ఎంతో దోహదపడుతుంది.

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ... టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖ ఇలాంటి ఆధునిక నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయం. ఆటో డ్రైవర్లు అందరూ నిబంధనలు పాటిస్తూ, పోలీసు శాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కదిరి మున్సిపల్ కమీషనర్ అజయ్ కుమార్ ,కదిరి ఆర్డీఓ కలావతి , ఆర్టీవో శ్రీనివాసులు, డి.ఎస్.పి శివన్నారాయణ స్వామి తహాశీల్దార్ రెడ్డి శేఖర్ , స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది, మున్సిపల్ అధికారులు, భారీ సంఖ్యలో ఆటో కార్మికులు, వాహన యజమానులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# మార్చిలోనే పోలవరం ప్రారంభం



**ఏలూరు– సూర్య వాస్తవం :** పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమాచారం వెల్లడించారు. ప్రస్తుతం 89 శాతం మేర పనులు జరిగాయని, గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా ప్రాజెక్టు పూర్తవుతుందని, ఆ తర్వాత జాతికి అంకితం చేస్తామని సీఎం పేర్కొన్నారు. గోదావరి జిల్లాల పర్యటన సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజి వద్ద జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ పునరుద్ధరణ, పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమైన సమాచారాన్ని సీఎం పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలవరం పనులు 89 శాతం పూర్తయ్యాయని సీఎం చంద్రబాబు వివరించారు. రెండేళ్లలోనే పనులు పరుగులు పెట్టించామని వ్యాఖ్యానించారు. 2014–19 మధ్య పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే చేసి చేతులెత్తేసిందని విమర్శించారు. 2019లో టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి చేసేవారమని సీఎం వ్యాఖ్యానించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసి వచ్చే మార్చిలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం హామీ ఇచ్చారుఇక ధవళేశ్వరం పర్యటన తర్వాత సీఎం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ముందుగా హెలికాప్టర్ నుంచి గోదావరి ప్రవాహం, ఎగువ దిగువ కాపర్ డ్యాం పనులను చూశారు. అనంతరం ప్రాజెక్టులోని ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 నిర్మాణాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేసేలా సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, కూటమి ప్రధాన ఎన్నికల హామీ అయిన పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే పూర్తి చేస్తామనే పట్టుదల ప్రభుత్వంలో కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. గత రెండేళ్లలో సుమారు 24 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్న ప్రభుత్వం పోలవరం పూర్తికి అధిక ప్రాధాన్యమిస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం స్పిల్ వేతోపాటు ఈసీఎఫ్ఆర్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఇంకా జల విద్యుత్ కేంద్రం నిర్మాణాలు మాత్రమే పెండింగులో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పూర్తయిన పనులతో కాలువలకు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సిద్ధం చేశాకే ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే ఖరీఫ్ నాటికి పోలవరం

## ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు అమూల్యమైనది

### -అన్నమయ్య డిసిసి ప్రధాన కార్యదర్శి సమీరుద్దీన్



**రాయచోటి-సూర్య వాస్తవం:** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ సర్ కార్యక్రమం మరో 10 రోజులు పొడిగింపడం, కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకోవడం సంతోషకరమైన విషయం అని అన్నమయ్య డిసిసి ప్రధాన కార్యదర్శి సమీరుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

**ముఖ్యమైన తేదీలు**

జూలై 15 -- జూలై 24: కొత్త ఓటర్ల నమోదు, పేరు చేర్పు, తొలగింపు, సవరణలు

జూలై 24: పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్

జూలై 31: డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

జూలై 31 -- ఆగస్టు 30: అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ అక్టోబర్ 3, 2026: తుది ఓటర్ల జాబితా ప్రచురణ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఈ సందర్భంగా సమీరుద్దీ విజ్ఞప్తి చేశారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన యువతీ, యువకులు తమ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటు ఉన్నవారు తమ వివరాలు సరిగా ఉన్నాయో లేదో ఒకసారి పరిశీలించు కోవాలని, అవసరమైతే పేరు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు చేయించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పంటల బీమా ప్రీమియం తప్పనిసరిగా చెల్లించాలి

### - ఈ-క్రాప్ నమోదు చేసుకుని ప్రభుత్వ బీమా ప్రయోజనాలు పొందండి

### - వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి






**వేంపల్లె - సూర్య వాస్తవం:** రైతులు తమ సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదుతో పాటు పంటల బీమా ప్రీమియాన్ని తప్పనిసరిగా చెల్లించాలని వేంపల్లె మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని టి.వెలమవారిపల్లి, బక్కన్నగారిపల్లి గ్రామాల్లో నిర్వహించిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో ఆయన రైతులతో కలిసి పొలాలను సందర్శించి సాగు పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సూచించిన ఆధునిక సాగు పద్ధతులు, మెళుకువలను పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుని, పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర కారణాలతో పంట నష్టపోయినప్పుడు బీమా పరిహారం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువులను ఎక్కువగా ఉపయోగించడం ద్వారా నేల సారాన్ని కాపాడడంతో పాటు నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఏ హారిక, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల దరఖాస్తుకు ఆహ్వానం

### - ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ

**వేంపల్లె - సూర్య వాస్తవం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకుల దరఖాస్తుకు ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ ఆహ్వానం పలికారు. వృక్షశాస్త్రం, గణితశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, చరిత్రశాఖ లకు సంబంధించి అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో ఈనెల 17 లోపు కళాశాలకు అందజేయాలని కోరారు. పిహెచ్ డీ, నెట్, స్లెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని, పీజీలో 55 శాతం మెరిట్ కలిగి ఉండాలని సూచించారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.




## వేంపల్లెని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

### - గ్రామ పంచాయతీ కార్యదర్శికి బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ విజ్ఞప్తి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లె గ్రామాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ భూతం నుంచి కాపాడి, ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీమతి కవితను కోరారు. ఇటీవల వేంపల్లికి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన గ్రామ పంచాయతీ కార్యదర్శిని మంగళవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పలు ప్రజా సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సుష్మ మాట్లాడుతూ, వేంపల్లిలో గత కొన్ని సంవత్సరాలుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిందని, ఉపయోగించిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా పడేస్తుండటంతో పర్యావరణం తీవ్రంగా కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు గతంలో గ్రామ పంచాయతీ అధికారులు వ్యాపారులు, ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, వాటి అమలులో ఆశించిన ఫలితాలు కనిపించలేదని పేర్కొన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, ప్రత్యా మ్నాయంగా పర్యావరణ హిత సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె కోరారు. ప్రజల ఆరోగ్యం, గోమాతల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా వేంపల్లిని ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కార్యదర్శిని విజ్ఞప్తి చేశారు. వినతికి స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీమతి కవిత, ప్లాస్టిక్ నియంత్రణపై త్వరలోనే ప్రత్యేక చర్యలు చేపట్టి, నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు సుష్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, కడప జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షుడు దొంతు సుమన్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఐటీ సెల్ కన్వీనర్ ప్రసాద్ రెడ్డి, సుభాష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "కార్మికుల సభ్యత్వం -- సంక్షేమం -- సమగ్ర చైతన్యం రాష్ట్ర సర్వేయాత్ర--3" కార్యక్రమంలో భాగంగా మంగళవారం బ్రహ్మంగారి మఠంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు చెరువుపల్లె ప్రతాపచారి అధ్యక్షతన ఆంధ్ర--కర్ణాటక విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. పాల్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి రావు, జిల్లా నాయకులు దస్తగిరి, సుభాన్, మల్లికార్జున ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు సభ్యత్వ నమోదు యొక్క ప్రాధాన్యతను వివరించారు. సభ్యత్వం ద్వారా లభించే సంక్షేమ పథకాలు, కార్మికుల హక్కుల పరిరక్షణ, అసోసియేషన్ రూపొందించిన 20 సూత్రాల అమలు, కార్మికుల ఐక్యత, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రతి కార్మికుడు అసోసియేషన్‌లో సభ్యత్వం పొందా లని, సంఘటిత శక్తితోనే కార్మిక సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెరువుపల్లె ప్రతాపచారి, మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాయకులు నాగేంద్ర, భాస్కర్, శివనారాయణతో పాటు మండలంలోని పలువురు ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ ప్రొద్దుటూరు పర్యటన

### - సమావేశ స్థలాన్ని పరిశీలిస్తున్న వక్ఫ్ బోర్డు స్టేట్ డైరెక్టర్ జాకీర్ అహ్మద్



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రొద్దుటూరు పర్యటిస్తున్న సందర్భంగా స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని తిమ్మయ్య కళ్యాణ మండపం సమీపాన ఏర్పాటు చేసిన సభా ప్రాంగణాన్ని మంగళవారం వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్ అహ్మద్, ఆయన సోదరుడు టిడిపి నాయకుడు ఆరిఫ్ వారి అనుచరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంత్రిగా ప్రొద్దుటూరు నియోజకవర్గనికి మొదటిసారి ప్రొద్దుటూరులో కార్యకర్తల సమావేశానికి వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలు విరివిరిగా భారీ సంఖ్యలో హాజరుకావాలని ఆయన సందర్భంగా పిలుపునిచ్చారు.

## ఎస్సార్ శ్రీనివాసులురెడ్డి చొరవతో తాగునీటి బోరు మరమ్మతు

### - గ్రామస్తుల హర్షం



**బ్రహ్మంగారిమఠం, సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని వీరనారాయణపురం గ్రామంలో త్రాగునీటి బోరు మోటారు గత నాలుగు రోజులుగా పనిచేయక పోవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి తాత్కాలిక చర్యగా నీటి ట్యాంకర్ల ద్వారా గ్రామానికి తాగునీటిని సరఫరా చేయించారు. అనంతరం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు స్థానిక మండల సీనియర్ తెలుగుదేశం నాయకుడు ఎస్సార్ శ్రీనివాసులురెడ్డి చొరవ తీసుకుని, బోరు మోటారును మరమ్మతు చేయించి మంగళవారం ఉదయం తిరిగి బిగింపజేశారు. దీంతో గత నాలుగు రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న వీరనారాయణపురం గ్రామ ప్రజలకు ఉపశమనం లభించింది. త్రాగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించిన ఎస్సార్ శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## తిరుపతిలో ఈశా గ్రామోత్సవం--2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన శాప్ చైర్మన్ రవి నాయుడు



**తిరుపతి-సూర్య వాస్తవం:** తిరుపతిలోని శాప్ చైర్మన్ రవి నాయుడు కార్యాలయంలో ఈరోజు ఈశా గ్రామోత్సవం సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, ఈశా గ్రామోత్సవం--2026 పోస్టర్‌ను రవి నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహణ, పోటీల వివరాలను ఆయనకు వివరించారు. అనంతరం రవి నాయుడు గారు మాట్లాడుతూ, గ్రామీణ భారతదేశంలో క్రీడా స్ఫూర్తి, ఐక్యత, ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంపొందించేందుకు ఈశా గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, యువత మరియు మహిళలను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈశా గ్రామోత్సవం--2026 దేశంలోని అతిపెద్ద గ్రామీణ క్రీడా ఉత్సవాలలో ఒకటిగా నిలుస్తోందని, 18వ సారి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 10 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 40,000కు పైగా గ్రామాల నుంచి 80,000 మందికి పైగా క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. ఖేలో ఇండియా గుర్తింపు పొందిన ఈ టోర్నమెంట్‌లో 7,000కు పైగా జట్లు, సుమారు 15,000 మంది మహిళా క్రీడాకారులు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. విజేత జట్లకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులు అందించనున్నారని, టోర్నమెంట్ వివిధ దశల్లో మొత్తం రూ.1 కోటి నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారని తెలిపారు. ప్రతి జట్టులోని ఆటగాళ్లందరూ ఒకే గ్రామానికి చెందినవారై ఉండటం ఈశా గ్రామోత్సవం ప్రత్యేకత అని, ఇది ప్రొఫెషనల్ క్రీడాకారుల కోసం కాకుండా గ్రామీణ ప్రజల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమమని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో జూలై 26న జిల్లా స్థాయి పోటీలు, ఆగస్టు 16న రాష్ట్ర స్థాయి పోటీలు ఎస్వీ క్యాంపస్ స్కూల్, బాలాజీ కాలనీ, తిరుపతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శాప్, యువజన సంక్షేమ శాఖల సహకారంతో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌కు ఇప్పటికే 40కు పైగా వాలీబాల్ జట్లు, 12కు పైగా త్రోబాల్ జట్లు నమోదు అయ్యాయని వెల్లడించారు. ఈశా గ్రామోత్సవం- -2026లో అర్హులైన గ్రామీణ క్రీడాకారులు ఉచితంగా పాల్గొనవచ్చని, ఆసక్తి గల వారు అంష్ఠు.ఎశీ/స్త్రతీఖఎశీయిఝఖఎ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రవి నాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో సంకల్ప ఎండీ డా. సోమేశ్వర్ ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ హిందీ పండిట్ ఆర్. మల్లీశ్వరి గారు, ఈశా గ్రామోత్సవం తిరుపతి కోఆర్డినేటర్ సాయికృష్ణ సూర్యదేవర గ్రామోత్సవ వాలంటీర్ దుర్గాప్రసాద్ గారు పాల్గొన్నారు.

# జపాన్‌లో తేలిపోయిన దురంధర్

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురందర్' ప్రపంచవ్యాప్తంగా మంచి విజయాన్ని అందుకున్నప్పటికీ, జపాన్ బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆశించిన ఆరంభాన్ని నమోదు చేయలేక పోయింది. ఈ ఫ్రాంచైజీకి ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ లభించగా, రెండు భాగాలు కలిపి రూ.3,100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి రికార్డులు సృష్టించాయి. అయితే జపాన్ మార్కెట్‌లో మాత్రం ఈ సినిమా ప్రారంభ కలెక్షన్లు నిరాశ కలిగించాయి. జూలై 10న జపాన్‌లో సుమారు 80 స్క్రీన్‌లలో గ్రాండ్‌గా విడుదలైన 'ధురందర్'కు విడుదలకు ముందు భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించారు. రణవీర్ సింగ్ అభిమానులతో పాటు భారతీయ సినీ ప్రేమికులు కూడా ఈ సినిమాపై మంచి అంచనాలు పెట్టుకున్నారు. కానీ ఆ అంచనాలకు తగ్గట్టుగా ప్రేక్షకాదరణ లభించలేదు. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, విడుదలైన తొలి రోజు మధ్యాహ్నం 2 గంటల వరకు 57 థియేటర్లలో ఈ చిత్రాన్ని కేవలం 449 మంది ప్రేక్షకులు మాత్రమే వీక్షించారు. సాయంత్రం, రాత్రి షోలతో కలిపినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదు. మొత్తం తొలి రోజు 80 స్క్రీన్‌లలో కేవలం 900 టికెట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఈ కలెక్షన్లతో వారాంతంలో జపాన్ బాక్సాఫీస్ టాప్-25 చిత్రాల జాబితాలో కూడా 'ధురందర్' స్థానం సంపాదించలేకపోయిందని తెలుస్తోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, ఇటీవల జపాన్‌లో విడుదలైన 'పుష్ప 2' కూడా ఆశించిన




స్థాయిలో రాణించలేకపోయింది. ఆ చిత్రం తొలి రోజు 886 టికెట్లు మాత్రమే విక్రయించగా, 'ధురందర్' 900 టికెట్లతో స్వల్పంగా మెరుగైన ఆరంభాన్ని నమోదు చేసింది. అయితే ఈ రెండు చిత్రాలు కూడా అక్కడ భారీ ఓపెనింగ్ సాధించలేకపోవడం విశేషం.




## తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం

### జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా

విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు.

ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం.సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్య దృష్టి

**- సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్**



అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.



# ఎట్టకేలకు గెలుపు బాట పట్టిన టీమిండియా..

# తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై ఘన విజయం!

**- తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై 6 వికెట్ల తేడాతో భారత్ విజయం- ఓటముల పరంపరకు ముగింపు పలికిన టీమిండియా**

**- శుభ్‌మన్ గిల్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ హాఫ్ సెంచరీలు- ఆల్ రౌండర్ అక్షర్ పటేల్‌కు నాలుగు వికెట్లు, అజేయ అర్ధశతకం**

మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన భారత్ ఇటీవల ఐర్లాండ్‌తో టీ20ల్లో ఓటమి, ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో 0-4 తేడాతో వైట్‌వాష్ ఎదుర్కొని తీవ్ర విమర్శలు మూటగట్టుకున్న టీమిండియా ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. ఇంగ్లండ్‌తో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లు అద్భుత ప్రదర్శనతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.259 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (80 రిటైర్డ్ హర్ట్) అద్భుత అర్ధశతకంతో శుభారంభం అందించాడు. అయితే, రోహిత్ శర్మ (11), విరాట్ కోహ్లీ (5) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో జట్టుపై ఒత్తిడి పెరిగింది. శ్రేయస్ అయ్యర్ (35)తో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. కానీ కీలక సమయంలో గిల్ గాయంతో మైదానం





వీడటం, ఆ తర్వాత అయ్యర్, కేఎల్ రాహుల్ (1) వెంటవెంటనే ఔటవడంతో భారత్ 160 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో అద్భుతంగా ఆడిన ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్), అక్షర్ పటేల్ (57 నాటౌట్) అజేయమైన ఐదో వికెట్‌కు 102 పరుగులు జోడించి మరో 28 బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు.
అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్ల ధాటికి ఒక దశలో 80 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్‌ను జో రూట్ (76 నాటౌట్), లియామ్ డాసన్ (68) హాఫ్ సెంచరీలతో ఆదుకున్నారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 4 వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇక ఇరుజట్ల మధ్య రెండో వన్డే కార్డిఫ్ లో జులై 16న జరగనుంది.

# యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో భారత క్లబ్‌లు అద్భుత ప్రదర్శన

## పంజాబ్ ఎఫ్‌సీకి 5-0 భారీ విజయం




జపాన్‌లో జరుగుతున్న యువ ఫుట్‌బాల్ మ్యాచ్‌లలో భారత అభివృద్ధి జట్లు (డెవలప్‌మెంట్ స్క్వాడ్స్) ఆకట్టుకునే ప్రదర్శన కనబర్చాయి. జూలై 14, 2027న కురాటే (జపాన్) వేదికగా జరిగిన పోటీల్లో భారత క్లబ్‌లు జపాన్ జే-లీగ్‌కు చెందిన జట్లతో తలపడగా, రెండు జట్లు విజయాలు నమోదు చేయగా, మరో జట్టు తృటిలో ఓటమి చవిచూసింది.

రోజంతా జరిగిన మ్యాచ్‌ల్లో అత్యంత ఏకపక్ష విజయాన్ని పంజాబ్ ఎఫ్‌సీ నమోదు చేసింది. అవిస్పా ఫుకుఓకాపై 5-0 తేడాతో ఘన విజయం సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మ్యాచ్ ప్రారంభమైన మూడు నిమిషాల్లోనే సింగమయుమ్ షామి తొలి గోల్ నమోదు చేయగా, 28వ నిమిషంలో మరోసారి గోల్ చేసి జట్టుకు బలమైన ఆధిక్యం అందించాడు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 42వ నిమిషంలో ఒమాంగ్ డోడుమ్ మరో గోల్ సాధించాడు. రెండో అర్ధభాగంలో 55వ నిమిషంలో నగారిన్ షైజా స్కోరు పెంచగా, ఇంజరీ టైమ్ (90౦2)లో విశాల్ యాదవ్ ఐదో గోల్ చేసి పంజాబ్ ఎఫ్‌సీ విజయాన్ని మరింత ఘనంగా నిలిపాడు. మరో ఆసక్తికర మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ 3-2 తేడాతో గిరావాంజ్ కిటాక్యూషుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 40వ నిమిషంలో ర్యునోసుకే ఇమై గోల్ చేయడంతో జపాన్ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే రెండో అర్ధభాగంలో బెంగళూరు ఎఫ్‌సీ అద్భుతంగా పుంజుకుంది. 61వ నిమిషంలో రక్షిత్ రక్షిత్ ప్రియా అనిల్ సమం చేసే గోల్ నమోదు చేశాడు. ఒక స్వీయ గోల్ కారణంగా మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారినప్పటికీ, 75వ నిమిషంలో సెర్టో వోర్నిలెన్ కోమ్ కీలక గోల్ సాధించాడు. చివరి నిమిషాల్లో జట్టు సమిష్టి రక్షణ ఆకట్టుకోగా, 90వ నిమిషంలో ఎండీ అర్బాష్ గోల్ చేసినప్పటికీ బెంగళూరు ఎఫ్‌సీ విజయాన్ని కాపాడుకుంది. మరో మ్యాచ్‌లో ఎఫ్‌సీ గోవా జపాన్‌కు చెందిన సాగన్ టోసుతో హోరాహోరీగా పోరాడినా 1-0 తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ ఆరో నిమిషంలోనే జెన్ర్యూ ఓనో చేసిన గోల్ ఆతిథ్య జట్టుకు విజయాన్ని అందించింది. ఆ తర్వాత ఎక్కువసేపు బంతిపై ఆధిపత్యం ప్రదర్శించిన గోవా, రెండో అర్ధభాగంలో పలు అవకాశాలు సృష్టించినా వాటిని గోల్స్‌గా మలచలేకపోయింది. జపాన్ జట్టు క్రమశిక్షణతో కూడిన రక్షణను ఛేదించడంలో విఫలమవడంతో గోవా ఖాళీ చేతులతో మ్యాచ్ ముగించింది.

# అభివృద్ధి లక్ష్యాలతో కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ

- అన్నా క్యాంటీన్ తరలింపు, హాస్టళ్లలో అదనపు సీట్లు, గిరిజనులకు భూ పట్టాలు మంజూరు చేయాలని వినతి
- సీజేఎఫ్ఎస్ ల్యాండ్స్ పట్టాల సమస్య సహా పలు ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే
- సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్.. సంబంధిత శాఖలతో సమన్వయం చేసి చర్యలకు హామీ



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, విద్య, ఆరోగ్యం, భూ హక్కుల కల్పన, సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నియోజ కవర్గానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్ర మాలు, ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నిన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన పరిపాలన అందిస్తూ సేవా కార్యక్రమాల్లో విజయవంతంగా ముం దుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రజల సంక్షేమం, విద్య, ఆరోగ్యం, భూ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పన తదితర అంశాలపై కలెక్టర్‌తో విస్తృతంగా చర్చించారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సూళ్లూరుపేట పట్టణంలోని గమల్ల వీధిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఆర్ అండ్ బి శాఖకు చెందిన 10 అంకణాల స్థలానికి తరలించాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. ఆ ప్రాంతం విద్యార్థులు, కూలీలు, ఆసుపత్రులకు వచ్చే రోగులు, వృద్ధులు, సాధారణ ప్రజలకు మరింత అందుబాటులో ఉంటుందని కలెక్టర్‌కు వివరించారు. అలాగే సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర సంక్షేమ హాస్టళ్లలో ప్రతి తరగతికి పది అదనపు సీట్లు మంజూరు చేయాలని కోరారు. సూళ్లూరుపేట బీసీ బాలికల హాస్టల్‌లో ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థినులకు ఒక్కో తరగతికి పది అదనపు సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. పెళ్లకూరు మండలం రోసనూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్--219లో సుమారు 150 ఎకరాల భూమిని ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తున్న 80 మంది గిరిజన కుటుంబాలకు డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇందుకోసం రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా భూ పరిశీలన నిర్వహించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన కుటుంబాలకు భూ హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పెళ్లకూరు మండలం బంగారంపేట రెవెన్యూ గ్రామ పరిధిలోని వేణుంబాక గ్రామం సర్వే నంబర్--02లో ఉన్న 35 ఎకరాల అడవి పోరంబోకు భూమిని సాగు చేస్తున్న 35 మంది పేద కుటుంబాలకు భూమి క్రమబద్ధీకరణ చేసి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకుడు, మండల ఏఎంసీ డైరెక్టర్ గోనుబాబు భీమవరం గ్రామంలోని సీజేఎఫ్ఎస్ పొలాలకు సంబంధించిన పట్టాల సమస్యను మరోసారి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సంబంధిత భూములపై త్వరలోనే సర్వే నిర్వహించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు పట్టాలు మంజూరు చేసే ప్రక్రియను చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతులపై జిల్లా కలెక్టర్ సాను కూలంగా స్పందించి, సంబంధిత శాఖల అధి, కారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపడ తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, విద్యా అవకాశాల విస్తరణ, భూ హక్కుల కల్పన, పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ రఫీ , మండల ఏఎంసీ డైరెక్టర్ గోనుబాబు తదితరులు ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్నారు.

# పేదల అన్నంపై అక్రమార్కుల కన్ను..

- పోలీసుల ఉక్కుపాదంతో భారీ రేషన్ బియ్యం పట్టివేత- నాయుడుపేటలో అంతర్జిల్లా స్మగ్లింగ్ ముఠాకు గట్టి దెబ్బ
- 16 టన్నుల ప్రభుత్వ బియ్యం స్వాధీనం.. చాకచక్యంగా వ్యవహరించిన అర్బన్ పోలీసులు- పాత నేరస్థుడు రమేష్ పాత్రపై దర్యాప్తు ముమ్మరం.. డ్రైవర్, హెల్పర్ అదుపులో



**నాయుడుపేట – సూర్య వాస్తవం:** పేద ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవాలన్న స్మగ్లింగ్ ముఠా యత్నాన్ని నాయుడుపేట అర్బన్ పోలీసులు భగ్నం చేశారు. కచ్చితమైన సమాచారంతో ముందస్తు వ్యూహాన్ని అమలు చేసిన పోలీసులు, విన్నమాల జాతీయ రహదారి వద్ద నిర్వహించిన తనిఖీల్లో సుమారు 16 టన్నుల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని అంతర్జిల్లా అక్రమ రవాణా వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు. మంగళవారం అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు కేసు వివరాలు వెల్లడించారు. ఏర్పేడు ప్రాంతం నుంచి నెల్లూరు వైపు భారీగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు తెలిపారు. విన్నమాల జాతీయ రహదారి కూడలిలో అనుమానాస్పదంగా వస్తున్న ఐషర్ లారీని అడ్డగించి తనిఖీ చేయగా, అందులో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ రేషన్ బియ్యం బస్తాలు తరలిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పోలీసులు వెంటనే లారీని స్వాధీనం చేసుకుని, అందులో ఉన్న సుమారు 16 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. లారీ డ్రైవర్‌తో పాటు హెల్పర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

**స్మగ్లింగ్ ముఠా వెనుక పాత నేరస్థుడి హస్తం**

ప్రాథమిక విచారణలో ఈ అక్రమ రవాణా వెనుక గతంలో కూడా రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసుల్లో నిందితుడిగా ఉన్న రమేష్ అనే వ్యక్తి ప్రధాన సూత్రధారిగా వ్యవహరించినట్లు ఆధారాలు లభించాయని సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ ముఠాలో మరికొందరు ఉన్నారా, ఎక్కడి నుంచి బియ్యం సేకరించారు, ఎవరికి సరఫరా చేయాలనుకున్నారు అనే అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**రెవెన్యూ అధికారుల సమక్షంలో చట్టపరమైన ప్రక్రియ పూర్తి**

స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని స్థానిక డిప్యూటీ తహసీల్దార్ బెన్ని, రెవెన్యూ అధికారుల సమక్షంలో చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి, అనంతరం సివిల్ సప్లైస్ శాఖ అధికారులకు అప్పగించి గోదాముకు తరలించారు

**అక్రమార్కులకు హెచ్చరిక**

ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ రవాణాపై పోలీసుల నిఘా మరింత కట్టుదిట్టం చేస్తామని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ దాడిలో అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐలు శివశంకర్, సురేష్‌బాబుతో పాటు పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆపరేషన్‌ను విజయవంతం చేశారు.

# స్వర్ణముఖి నుంచి అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

- రెండు ట్రాక్టర్లు స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు
- సమాచారం అందడంతో వెంటనే స్పందించిన పోలీసులు



**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని పుల్లూరు--కలవకూరు ప్రాంతంలోని స్వర్ణముఖి నది నుంచి యాలకారి కండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రమ్మణ్యం, జగదీష్ అనే ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు స్థానిక పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనుమతులు లేకుండా సహజ వనరులను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజలు కూడా ఇలాంటి ఘటనలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని సూచించారు.

# జిల్లావ్యాప్తంగా "శక్తి టీమ్స్" అవగాహనలు

- మహిళల భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో మహిళల రక్షణ, సైబర్ నేరాల నియంత్రణ మరియు మాదకద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ప్రత్యేక ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, తాడిపత్రి, గుంతకల్లు, మరియు కళ్యాణదుర్గం సబ్ డివిజన్ల "శక్తి బృందాలు" రంగంలోకి దిగాయి. జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు, విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు, మరియు రద్దీగా ఉండే ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు విభిన్న అంశాలపై అవగాహన కల్పించారు.

**శక్తి బృందాలు వివరించిన ముఖ్యమైన అంశాలు :**

'శక్తి యాప్' డౌన్‌లోడ్ మరియు వినియోగం: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన 'శక్తి యాప్'ను ప్రతి ఒక్కరూ తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏదైనా విపత్కర లేదా ఆపద సమయాల్లో ఈ యాప్ మహిళలకు ఎలా రక్షణగా నిలుస్తుందో ప్రాక్టికల్‌గా డెమో ఇచ్చి వివరించారు. మహిళలు, చిన్నారుల రక్షణ: సమాజంలో మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా, వెనుకాడకుండా పోలీసులను ఆశ్రయించాలని ధైర్యం చెప్పారు. అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు: ప్రమాద సమయాల్లో తక్షణ సహాయం కోసం డయల్ 100 / 112, బాలల రక్షణ కోసం 1098, మరియు మహిళల తక్షణ సహాయం కోసం 181 నంబర్లను ఎలా సంప్రదించాలో ప్రజలకు వివరించారు. సైబర్ నేరాలు ఒ ఏటీఎం మోసాలు: ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు, ఏటీఎం మోసాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ?ఫేక్ కాల్స్ ఒ ఓటీపీ జాగ్రత్తలు: బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ ఫోన్ కాల్స్ నమ్మవద్దని.. ఎట్టి పరిస్థితుల్లోనూ మీ వ్యక్తిగత బ్యాంక్ వివరాలు, ఏటీఎం పిన్ నంబర్ లేదా ఓటీపీ (ఝూ)లను ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. డ్రగ్స్ నిర్మూలనపై పోరాటం: సమాజాన్ని పీడిస్తున్న గంజాయి, తదితర మత్తు పదార్థాల (డ్రగ్స్) మహమ్మారి వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, వాటికి దూరంగా ఉండాలని యువతకు, మహిళలకు పిలుపునిచ్చారు.

# బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ సునీల్ రెడ్డికి ఘన సత్కారం

**డోన్ – సూర్య వాస్తవం:** నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ సునీల్ రెడ్డి ని, బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీ ఎద్దుల హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో, బీజేపీ యువ మోర్చా నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ విజయ్ భాస్కర్ సొప్పాకులతో పాటు పార్టీ నాయకులు ఘనంగా గజమాలతో సత్కరించి తమ గౌరవాభిమానాలను తెలియజేశారు రాష్ట్రవ్యాప్తంగా యువతను భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షిస్తూ జాతీయవాద భావజాలాన్ని బలోపేతం చేయడంలోయువ మోర్చా సంస్థను గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తున్న శ్రీ ఎస్ సునీల్ రెడ్డి సేవలను కొనియాడుతూ ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దుల హరినాథ్ రెడ్డి మాట్లాడుతూయువతే దేశ భవిష్యత్తు అనే లక్ష్యంతో రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సునీల్ రెడ్డి నిరంతరం యువతను చైతన్యపరుస్తూ, సేవా కార్యక్రమాలు, ప్రజా ఉద్యమాలు మరియు పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. వారి నాయకత్వం యువ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పార్టీని ముందుకు నడిపిస్తూ రాష్ట్రంలో బీజేపీ విజయాలకు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు బీజేపీ యువ మోర్చా నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ విజయ్ భాస్కర్ సొప్పాకుల మాట్లాడుతూ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సునీల్ రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సమాజ సేవనే లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, క్రమశిక్షణ సేవా దృక్పథాన్ని పెంపొందించడంలో ఆయన నాయకత్వం ఎంతో ఆదర్శప్రాయమని అన్నారుఈ కార్యక్రమంలోహరీష్, రాజు తదితర నాయకులు పాల్గొని రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎస్. సునీల్ రెడ్డి ని గజమాలతో ఘనంగా సత్కరించి తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ముగింపులో నాయకులు మాట్లాడుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో, రాష్ట్ర అధ్యక్షులు ఎస్. సునీల్ రెడ్డి, మార్గదర్శకత్వంలో యువ మోర్చా కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజాసేవనే పరమావధిగా భావించి మరింత అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )